





కాంగ్రెస్ అభ్యర్థిగా రాజేందర్‌రావు

- వీడిన కరీంనగర్ అభ్యర్థి చిక్కుముడి
- ఫలించిన మంత్రి పొన్నం ప్రయత్నాలు
- రేపు ఇల్లంతకుంట మీదుగా జిల్లాకు రాక

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ లోక్‌సభ నియోజక వర్గ అభ్యర్థిత్వం వెలిచాల రాజేందర్‌రావుకే దక్కింది. రెడ్డి, వెలమ, బీసీ అభ్యర్థుల్లో ఎవరికి అవకాశం కల్పించాలో తేల్చుకోలేక పదికిపైగా సమావేశాల్లో చర్చోపచర్చలు చేసిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ చివరకు రాజేందర్‌రావు అభ్యర్థిత్వం వైపే మొగ్గుచూపింది. దీంతో నెల రోజులుగా ప్రయత్నించినా కొద్ది బిగుసుకు పోయిన చిక్కుముడి ఎట్టకేలకు వీడిపోయింది. కేరళ పర్యటనలో ఉన్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఢిల్లీకి రాగానే మంగళవారం రాత్రి కానీ బుధవారం ఉదయం కానీ అభ్యర్థిని ఖరారు చేసిన ప్రకటన విడుదల చేస్తారని పార్టీవర్గాల సమాచారం. అధిష్ఠానం పెద్దలు అభ్యర్థిత్వం ఖరారు చేసిన విషయాన్ని రాజేందర్‌రావుకు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేసి తెలిపారని తెలిసింది. అభ్యర్థిగా ఎంపికైన వెలిచాల రాజేందర్‌రావు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మీదుగా పలు గ్రామాల్లో పర్యటించి కరీంనగర్‌కు రానున్నారు. ఈనెల 18 నుంచి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశాలు నిర్వహించేందుకు మంత్రి పొన్నం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఆ రోజు ఇక్కడే ఉన్న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్‌మున్షి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల కమిటీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర సభ్యులతో సమావేశమై చర్చించి అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు.

● జిల్లా నాయకుల మద్దతుతో..

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆసక్తి చూపించి టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, పార్టీ నాయకుడు రుద్ర సంతోష్ కుమార్, తీన్మార్ మల్లన్నతో పోటీ పడ్డారు. ఎప్పటికప్పుడు రాజకీయ సమీకరణాలు మారుతూ వస్తూ అభ్యర్థిత్వం పెండింగ్‌లో పడుతూ వస్తున్నా పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నం కొనసా గిం చారు. చివరకు ఆయన ప్రయ త్నాలు ఫలించి కరీంనగర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం పొం దారు. ఈ ప్రయత్నంలో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మె ల్యేలు కవ్వంపల్లి సత్యనా రాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, పార్లమెంట్ నియోజక వర్గ పరిధి లోని నియోజక వర్గ ఇన్‌చార్జీలు వొడితెల ప్రణవ్, పురమల్ల శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి ఆయనకు అండగా నిలిచారు. రాజేందర్‌రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించడంలో వారు కూడా కీలక పాత్ర వహించారు.

● రాజకీయ నేపథ్యం

వెలిచాల రాజేందర్‌రావు తండ్రి వెలిచాల జగపతిరావు కరీంనగర్ శాసన సభ్యుడిగా పనిచేశారు. రాజేందర్‌రావు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించడమే కాకుండా పార్టీలో వివిధ పదవుల్లో సేవలందించారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడిన తర్వాత రాజేందర్‌రావు ఆ పార్టీలో చేరి 2004లో చొప్పదండి నియోజక వర్గ టికెట్ ఆశించారు. ఆయనకు పార్టీ పోటీ చేయడానికి వీలుగా బీ ఫారం అందించింది. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న టీఆర్ఎస్ రాజేందర్‌రావును పోటీ చేయవద్దని కోరింది. ఆయన పోటీ నుంచి తప్పుకోవడానికి నిరాకరించారు. తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరి సినీనటుడు చిరంజీవి నాయకత్వానికి మద్దతు తెలిపారు. ఆ పార్టీని జిల్లాలో విస్తరింపజేసి 2009లో ఆపార్టీ అభ్యర్థిగా కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి పోటి చేశారు. 1.75 లక్షల ఓట్లను సాధించి ఆయన మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత రాజేందర్‌రావు జిల్లాలో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నా ఆయన తండ్రి జగపతిరావుతో కలిసి ప్రజలకు అందుబాటులో ఉంటూ జిల్లాలోని నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు.

● రేపటి నుంచి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశాలు

కరీంనగర్ అర్బన్: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ సమావేశాలు కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో నాలుగు రోజుల పాటు నిర్వహించను న్నారు. 18న కొత్తపల్లి సాయిగార్డెన్‌లో ఉదయం 10 గంటలకు మాన కొండూర్ నియోజకవర్గంస్థాయి సమావేశం, మద్యాహ్నం 2 గంటలకు హుజురాబాద్ వెంకట సాయి గార్డెన్‌లో హుజురాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేం ఉంటుంది. 19న ఉదయం 11 గంటలకు హుస్నాబాద్ శుభం గార్డెన్‌లో హుస్నాబాద్ నియోజకవర్గస్థాయి, మద్యాహ్నం 2 గంటలకు సిరిసిల్ల నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించున్నారు. 20న ఉదయం 10 గంటలకు వేములవాడ నియోజకవర్గస్థాయి, మద్యాహ్నం 2 గంటలకు చొప్పదండి నియోజకవర్గస్థాయి సమావేశాలు ఉంటాయి. 21న ఉదయం 10 గంటలకు కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కరీంనగర్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని ప్రభుత్వ విప్, రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు బ్లాక్, మండల, పట్టణ, కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల, సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కష్టాలను ఎదిరించి..
లక్ష్యాన్ని సాధించి..

- యూపీఎస్సీలో మెరిసిన వెలిచాల యువకుడు
- జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన బీడీ కార్మికురాలి కుమారుడు

తల్లి ఓ బీడీ కార్మికురాలు.. తండ్రి చేనేత కార్మికునిడిగా పనిచేస్తూ ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు.. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రం.. ఇవేవీ అతడు అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అడ్డంకి కాలేదు. కష్టాలు ఎన్ని ఎదురైనా అధిగమించి సివిల్స్‌లో జాతీయ స్థాయి 27వ ర్యాంకు సాధించాడు రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సాయికిరణ్. వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సిద్ధమై రెండో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించాడు. ఆయన సోదరి స్రవంతి ఏఈఈగా ఉద్యోగం చేస్తున్నారు. తల్లి లక్ష్మి బీడీలు చేస్తూ పిల్లలిద్దరినీ ఉన్నత చదువులు చదివించారు. ఇప్పుడు వారిద్దరూ ప్రయోజకులు కావడంతో తన కష్టానికి తగ్గ ఫలితం లభించిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- రామడుగు

7లో



నేడు శ్రీరామనవమి



శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

● సీతారాముల కల్యాణానికి ఆలయాల్లో ఏర్పాట్లు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: సమాజ విలువలు, ధర్మాలు, ఉన్నత జీవన విధానాన్ని లోకానికి అందించిన శ్రీరాముడు జన్మించిన నవమి నాడే కల్యాణాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్నది. రాముడిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని శాస్త్రవచనం. చైత్రశుద్ధ పాడ్యమి, ఉగాది నుంచి నవమి వరకు వసంతరాత్రులు జరిపి కల్యాణాన్ని నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమి పర్వదినాన్ని బుధవారం జరుపుకోనున్నారు.

● ఆలయాల్లో ఏర్పాట్లు...

కరీంనగర్‌లో సప్తగిరికాలని, వావిలాల పల్లి, గాంధీరోడ్, దేవుళ్ళపురి రామాలయాలతో పాటు పలు ఆలయాల్లో ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, నీటి వసతి, ప్రత్యేక వేదికలు, అన్నదానం వంటి ఏర్పాటు చేయగా ఆలయాలను విద్యుద్దీపాలు, షామి యానాలు, పుష్పమాలలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులకు అలంకారాలు చేసి ఎదుర్కోలు వేడుకను నిర్వహించారు. నగరంలో శ్రీరామనవమి సంద ర్భంగా బుధ వారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతారామ కల్యాణాలు నిర్వహించ నున్నారు. సప్తగిరికాలనీ కోదండ రామాలయం, వావిలాలపల్లి రామాలయం, గాంధీ రోడ్ రామాలయం, దేవుళ్లపురి రామాలయంతోపాటు వాసవి కన్యకాపర మేశ్వరి, రామేశ్వర, రమాసత్యనారాయణ అభయాంజ నేయస్వామి, మహాశక్తి, గిద్దెపెరుమాళ్ళ, హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రసన్నాంజనేయ, ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయ, భగత్‌నగర్ అంజనాద్రి, జడ్పీ క్వార్టర్స్ వేంకటేశ్వర, శ్రీపురం భక్తాంజనేయ, పాతబజార్ వీరాంజనేయ, చిన్న హను మాన్, వావిలాలపల్లి గుండు హనుమాన్, గణేశ్ నగర్ ప్రసన్నాంజనేయ, కట్టరాంపూర్ అభయాంజ నేయ, లేబర్ అడ్డా భక్తాంజనేయ, జ్యోతినగర్ హనుమాన్ సంతోషి మాత, మార్కెట్ రోడ్, మంకమ్మతోట, విద్యానగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీరాంనగర్‌కాలనీ శ్రీవినాయక స్వామి దేవాలయం, రామచంద్రాపురి రామభక్తాంజనేయ, ముక రంపుర ఆంజనేయ, యజ్ఞవరాహస్వామి, తదితర ఆల యాల్లో కల్యాణాలు కన్నుల పండువగా జరగనున్నాయి.



మహాశక్తి ఆలయంలో..



సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన షామియానాలు

● ఇల్లందకుంటలో ఘనంగా ఏర్పాట్లు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని బుధవారం అత్యంత వైభవంగా జరిపిం చేందుకు ఆలయ కార్యానిర్వాహణాధికారి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీటి, వైద్య సదుపాయంతో పాటు, బస్ సౌకర్యం, కల్యాణాన్ని తిలకించేందుకు ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. జమ్మికుంట రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం నిత్యవిధి అనంతరం సాయంత్రం శ్రీవిశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన బందోబస్తును ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

'స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలి'


హుజూరాబాద్, ఏప్రిల్ 16: గత సంవత్సరం బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నర్సింహస్వామి డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లో తెలంగాణ టీచర్స్ యూనియన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సంవత్సర మైనా రాష్ట్ర ప్రభుత్వం వారిని రిలీవ్ చేయాలని కోరారు. సమా వేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి, తాళ్ల తిరుపతి, పొద్దుటూరి కిషన్‌రెడ్డి, నాగరాజు, గోపి, వేణుగోపాల్, శ్రీనివాస్, కొండాల్‌రెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16: వంటగ్యాస్ లీకేజీ కారణంగా ఇళ్లలో జరిగే అగ్నిప్రమాదాలను ఎలా నియంత్రించవచ్చనే దానిపై కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రాంచంద్రాపూర్ కాలనీ మహిళలు, ప్రజలను సమావేశపరిచి మంటలను నియంత్రించే పద్ధతులను వివరించారు.









రామాయణం లోకానికి దిక్సూచి



మాట్లాడుతున్న చిన్నజీయరు స్వామి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: రామాయణం లోకానికి దిక్సూచి వంటిదని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరుస్వామి అన్నారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ పద్మనాయక కల్యాణ మండపంలో ఆయన మంగళవారం ఉద యం, సాయంత్రం ప్రవచనం చేశారు. త్రేతాయుగ పురుషుడైన రాముడు నారాయణుడి అంశతో మానవుడిగా జన్మించి లోక నీతిని, రీతిని తెలియజెప్పాడన్నారు. రామాయణాన్ని చదివితే ఎన్నో విషయాలు తెలుస్తాయని, వాటిని ఆచరించాలని సూచించారు. రామాయణం వినడం, పారాయణం చేయంచుకోవడం ద్వారా సకల శుభాలు కలుగుతాయన్నారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహరావు, కె గౌతమరావు, బీవీ రావు, ఎస్ వెంకటేశం, ఎల్ భూపతిరావు, యాద కిషన్, కె వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

● నేడు సీతారామ కల్యాణం.... పట్టాభిషేకం...

బుధవారం ఉదయం 10 గంటల నుంచి సీతారామ కల్యాణ మహోత్సవం, శ్రీ రామ పట్టాభిషేక మహోత్సవం చిన్న జీయరుస్వామి సమక్షంలో జరుగనున్నాయి. ఇందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ధర్మారం,ఏప్రిల్16: ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మిట్ట మహిపాల్(45) అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

మల్లాపూర్, ఏప్రిల్, 16: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య(34) అనే రైతు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య అనే రైతు మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి రేకుల షెడ్డులోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నర్సయ్య భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● ఎస్‌యూ వీసీ ఆచార్య మల్లేశ్

గణేశ్‌నగర్, ఏప్రిల్16: ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య మల్లేష్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 2024 మహనీయుల జయంత్యుత్సవాలను (మహాత్మాజ్యోతిరావుపూలే, సావిత్రిబాయ్ పూలే, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ) ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశమంతా మహనీయుల సేవలను గుర్తించుకోవాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య అడప సత్యనారాయణ మాట్లాడుతూ అత్యంత ప్రభావశీలి, దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆచార్య గోన నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వడమే ధ్యేయంగా పూలే దంపతులు జీవించారన్నారు. ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె పద్మావతి మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లతో అందరికీ సమాన అవకాశాలు వచ్చాయన్నారు. జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ మహనీయులంతా దేశ ప్రగతి కోసం, సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం సరసిజ, ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కె తిరుపతి, డి విజయ ప్రకాష్, డి.విజయ్ కుమార్, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

టిప్పర్లకు జరిమానా

మల్యాల, ఏప్రిల్ 16: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లకు రెవెన్యూ అధికారులు ఒక్కో టిప్పరుకు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. సోమవారం మండలంలోని బల్వంతాపూర్‌లో గల రేగుల చెరువు నుంచి అక్రమంగా నల్లమట్టి తవ్వకాలు చేపట్టారనే దానిపై భారతపు శేఖర్‌తో పాటు ఎనిమిది టిప్పర్ల యజమానులు, డ్రైవర్లపైన పోలీసులు సుమోటో కేసు నమోదు చేసి టిప్పర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీంతో తహసీల్దార్ టిప్పర్లకు జరిమానా విధించారు.

● ఇద్దరిపై కేసు..

మల్యాల మండలంలోని రాంపూర్ శివారులో వరదకాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కావేటర్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ బంగారపు రమేష్, మట్టి తీస్తున్న ఎక్స్‌కావేటర్ యజమాని గంగాధర్‌పై ఇరిగేషన్ ఏఈఈ అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

● టిప్పర్ డ్రైవర్‌పై కేసు..

మల్యాల మండలంలోని రాజారంలో టిప్పర్ ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం అయింది. టిప్పర్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సాయి దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ సస్పెండ్

హుజూరాబాద్, ఏప్రిల్ 16: హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. సోమవారం ఆర్టీసీ డ్రైవర్ రవీందర్ చార్జి మెమో విషయంలో రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌లో డిపో మేనేజర్ శ్రీకాంత్ ఏసీబీకి చిక్కిన విషయం విధితమే. డిప్యూటీ ఆర్‌ఎం సురికొంటి భూపతిరెడ్డి డీఎంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపించగా, సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16: నిషేధిత గంజాయి రవాణా, అమ్మకాలు జరుపుతున్న ఆరుగురుఇ వ్యక్తులను గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న సోమవారం సంత ఆవరణలో మచ్చుపేటకు చెందిన రఘును గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. రఘుని అదుపులోకి తీసుకుని విచారించగా, గుంటూరుపల్లికి చెందిన శివారూట్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కాలనీ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపినట్టు సీఐ పేర్కొన్నారు. గుంటూరుపల్లిలో శివారూట్ కోసం వెళ్లగా అక్కడ శివ దగ్గర పనిచేసే మధు అదుపులోకి తీసుకుని విచారించినట్టు సీఐ తెలిపారు.

మధు ఇచ్చిన సమాచారం ఆధారంగా శివారూట్ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వినోద్, శివప్రసాద్, చైతన్య, సాయి రేవంత్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1,117 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ బీ రవీందర్ తెలిపారు.

కష్టాలను ఎదిరించి.. లక్ష్యాన్ని సాధించి

- యూపీఎస్సీలో మెరిసిన వెలిచాల యువకుడు
- జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన బీడీ కార్మికురాలి కుమారుడు

రామడుగు, ఏప్రిల్ 16: తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు.. తల్లి బీడీలు చేస్తూ కొడుకును పోషించింది. ఎటు చూసినా కష్టాలు.. అయినా అతడు తన లక్ష్యంపైనే దృష్టి పెట్టాడు. అనుకున్నది సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అతడే రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సాయికిరణ్. అతడు బీటెక్ చదువుతుండగా తండ్రి క్యాన్సర్‌తో మృతి చెందాడు. సాయికిరణ్‌కు స్రవంతి అనే ఒక సోదరి ఉంది. పిల్లలిద్దరూ చదువులో ముందుండేవారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా తల్లి లక్ష్మి ధైర్యం కోల్పోలేదు. బీడీలు చేస్తూ పిల్లలను చదివించింది. పిల్లలూ


తల్లి, సోదరితో సాయికిరణ్

ఆమె నమ్మకాన్ని వమ్ము చేయలేదు. సాయికిరణ్ సోదరి స్రవంతి ఏఈఈగా పనిచేస్తున్నారు. సాయికిరణ్ వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేసి ఓ కంపెనీలో హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఆర్థికంగా కొంత వెసులుబాటు లభించిన తర్వాత తాను చిన్నప్పటి నుంచి కలలు కన్న సివిల్స్‌పై దృష్టి సారించాడు. 2021 నుంచి ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా తానే సొంతగా ప్రిపేర్ అయ్యాడు. రెండో ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ స్థాయిలో 27వర్యాంకు సాధించాడు.

అమ్మ అండతో చదివాను

- సాయికిరణ్, సివిల్స్ 27వ ర్యాంకర్

కష్టపడి చదివాను.. అనుకున్నది సాధించాను. ఇది నా జీవితంలో మధురమైన సందర్భం. అత్యున్నతమైన స్థానానికి చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. మా అమ్మ అండగా నిలవడం వల్లే ఇది సాధ్యమైంది. కష్టాలను ఎదురించి మమల్ని చది వించిన అమ్మ ఇప్పుడు సంతోషంగా ఉంది. నాలాగే కష్టపడి చదివే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ సహకారాన్ని అందిస్తానను.

● విద్యాభ్యాసం

సాయికిరణ్ రామడుగు మండలం వెలచాల గ్రామంలో సరస్వతి పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. కరీంనగర్‌లో పదో తరగతి, ఇంటర్, వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు.

సంతోషంగా ఉంది

- లక్ష్మి, సాయికిరణ్ తల్లి

చాలా సంతోషంగా ఉంది. సాయికిరణ్ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించడం మాకందరికీ గర్వకారణం. మా ఆయన లేకపోయినా కష్టపడి ఇద్దరు పిల్లలను చదివించాను. వారిద్దరు ప్రయోజకులయ్యారు. నా కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించింది. ఒక తల్లికి ఇంతకంటే సంతోషం ఏముంటుంది.


వెలిచాలలో సాయికిరణ్ ఇల్లు

'సహన'ంతో ముందుకుసాగి..

సివిల్స్‌లో 739వ ర్యాంకు సాధించిన కరీంనగర్ యువతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 16: యూపీఎస్సీ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన సహన జాతీయస్థాయిలో 739వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత, జయశంకర్ ప్రసాద్ (అనిల్) దంపతుల కూతురైన సహన కెన్‌క్రెస్ట్ స్కూల్‌లో ఎసెస్సీ చదివారు. శ్రీగాయత్రీ జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్ పూర్తికాగానే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చినప్పటికీ సివిల్స్‌పై మక్కువతో ఉద్యోగంలో చేరకుండా ఢిల్లీకి వెళ్లి కోచింగ్ తీసుకున్నారు. తొమ్మిది నెలలు కోచింగ్ తీసుకున్న సహన మూడుసార్లు సివిల్ పరీక్ష రాశారు. నాలుగో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 739వ ర్యాంకు సాధించారు. సహన తండ్రి జయశంకర్ ప్రసాద్ (అనిల్) ప్రైవేట్ కళాశాలలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఒక దినపత్రికలో పాత్రికేయుడిగా పనిచేస్తున్నారు. తల్లి గీత గృహిణి. తమ కూతురు కష్టపడి చదివి నందుకు తగిన ఫలితం దక్కిందని, ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో సివిల్స్‌కు ప్రిపేర్ అ య్యానని సహన చెప్పారు. ఈ ర్యాంకుతో ఐఆర్ఎస్ వస్తుందని, జాబ్‌లో జాయిన్ అయిన తర్వాత మళ్లీ సివిల్స్ రాసి ఐఏఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.


విజయ సంకేతం చూపుతున్న సివిల్స్ ర్యాంకర్ సహన


సహనకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు గీత, జయశంకర్‌ప్రసాద్ (అనిల్)



ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై

కొనసాగుతున్న విచారణ

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయుల జీతాల బిల్లుల నిధులు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ అధికారిగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీ రాం మొండయ్య, బెజ్జంకి, కోహెడ ఇంచార్జ్ ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్న పావని ప్రజెంటింగ్ అధికారిగా, జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కన్సల్టెంట్ రవీందర్‌ను టెక్నికల్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారు. ఈ నెల 15న విచారణ ప్రారంభించారు. రెండవ రోజు మంగళవారం 16న కూడా విచారణ కొనసాగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజభాను చంద్రప్రకాశ్‌తో పాటు మొత్తం 21మంది ఉపాధ్యాయులను విచారణ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నివేదికను జిల్లా విద్యాశాఖధికారికి సమర్పిస్తామని విచారణ అధికారి శ్రీరాం మొండయ్య తెలిపారు.

రాముని కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పణ

ఇల్లందకుంట, ఏప్రిల్ 16: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే శ్రీరామనవమిని పురస్కరించుకొని మంగళవారం ధర్మపురి, కొండగట్టు ఆలయాల కార్యనిర్వాహణాధికారులు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో కొండగట్టు ఈవో చంద్రశేఖర్, ధర్మపురి ఈవో శ్రీనివాస్, ఇల్లందకుంట ఈవో కందుల సుధాకర్, అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యులు పాల్గొన్నారు.





నేడే సీతారాముల కల్యాణం

- ముస్తాబైన రాజన్న క్షేత్రం ● ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు ● తరలివస్తున్న భక్తుల

వేములవాడ, ఏప్రిల్ 16:వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీసీతారామచంద్ర స్వామివారల దివ్య కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో భద్రాద్రిని తలపించేరీతిలో శ్రీసీతారామచంద్రస్వామివారి కల్యాణ వేడుకలను అత్యంత ఘనంగా, కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 17వ తేదీ బుధవారం ఉదయం 11-59 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించే విధంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆలయం, రాజగోపురం, ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. చైర్మన్ ఛాంబర్ ఎదుట విశాలమైన కల్యాణ వేదికను నిర్మించి పూలతో అందంగా అలంకరించారు. వేదిక పరిసరాల్లో కలకత్తా టెంట్లు, పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులు కూర్చునే ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎండవేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎయిర్ కూలర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయ ముందుభాగంతో పాటు పాత ఆంధ్రాబ్యాంక్ ఏరియా, అంబేద్కర్ విగ్రహం కూడలి మొత్తం కలకత్తా పందిళ్లు వేశారు. శ్రీసీతారాముల కళ్యాణం భక్తులందరూ వీక్షించడానికి వీలుగా పలు చోట్ల ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య శిబిరాలు, స్పెషల్ రెస్క్యూ బృందాలు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్, అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉంచారు. భక్తుల కోసం మంచినీటి ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. దాతల సహకారంతో అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేయనున్నారు.


గదుల కోసం వేచి చూస్తున్న భక్తులు


విద్యుత్‌కాంతులతో రాజన్న ఆలయం

తరలివస్తున్న భక్తులు..

శ్రీసీతారాముల కళ్యాణం తిలకించడం కోసం వేలాది మంది భక్తులు రాజన్న క్షేత్రానికి తరలివస్తున్నారు. 17వ తేదీ బుధవారం ఉదయం నిర్వహించనున్న కల్యాణం ప్రత్యక్షంగా తిలకించాలన్న కోరికతో మంగళవారం రాత్రి వరకు సుమారు 70 వేల మందికి పైగా భక్తులు వేములవాడకు చేరుకున్నట్లు అంచనా. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యాత్రీకులతో ఆలయ వసతి గదులు, ప్రైవేటు అద్దె గదులు నిండిపోయాయి. గదులు అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది భక్తులు బహిరంగ ప్రదేశాలలోనే బస చేయాల్సి వచ్చింది. జానకిరాముల కల్యాణం సందర్భంగా త్రిశూలం ధరించి, తలంబ్రాలు పోసుకుని శివుడిని మను వాడే ఆనవాయితీ ఉన్న వేలాది మంది శివ పార్వతులతో పాటు భారీ సంఖ్యలో హిజ్రాలు వేములవాడ చేరు కున్నారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామివారిదేవస్థానంలో బుధవారం కోడె మొక్కులు మినహా ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

వివాహిత ఆత్మహత్య


సుమలత(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన గోస్కుల సుమలత(26)కు 2017వ సంవత్సరంలో తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల కూతురు ఉంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమలత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

జీవితంపై విరక్తితో..

ముస్తాబాద్, ఏప్రిల్ 16: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్సై శేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన బొప్ప బాలయ్య(67) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వ్యాధి మరింత ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని కొడుకు బొప్ప అనిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన సావనపెల్లి పోచవ్వ (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పోచవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తిచెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన కంకటి స్వామి (45) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. స్వామి గ్రామంలో కిరాణం దుకాణం నడుపుకొని జీవిస్తున్నాడు. వ్యవసాయ భూములలో బోర్లు వేయడం వల్ల దాదాపు 23లక్షల అప్పులు అయ్యాయి. అప్పు చెల్లించడానికి తనకు ఉన్న భూమిని అమ్మడానికి ప్రయత్నించగా తమ్ముడు ప్రభాకర్ అడ్డుచెప్పాడు. ఇంటిని అమ్మి అప్పులు తీర్చుదామనుకున్నా ఇంటిపై ప్రభాకర్ రుణం తీసుకున్నాడు. ఇదే విషయంపై తమ్ముడిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీనితో సోమవారం అర్ధరాత్రి క్రిమిసంహారక మందుతాగగా సిరిసిల్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తన భర్త మృతికి ప్రభాకర్, అప్పులే కారణం అని కడుపుపై రాసుకొని చనిపోయాడని మృతుడి భార్య నాగమణి ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం


రాజయ్య(ఫైల్)

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 16: తన భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు అదృశ్యం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లికి చెందిన కొలకాని రాజయ్య (46) ఎనిమిది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రెండు సంవత్సరాలుగా ఆరోగ్యం బాగా ఉండటం లేదు. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ నెల 9న రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బ్లూ కలర్ ప్యాంట్, ఎల్లో కలర్ టీషర్టు ధరించి ఉన్నాడు. రాజయ్య భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

స్కూల్ వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం


అరీబా (ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 16: కొడుకును స్కూల్ వ్యాన్ ఎక్కించడానకి వెళ్లిన తల్లి.. తన వెనుకాలే వస్తున్న తన కూతురును గమనించక పోవడంతో అదే వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన రజాక్, హసీనకు కొడుకు సాజిత్, కుమార్తె అరీబా(18నెలలు) ఉన్నారు. కొడుకు పక్క గ్రామంలోని సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. మంగళవారం ఉదయం స్కూల్ వ్యాన్ రావడంతో కొడుకును ఎక్కించేందుకు తల్లి హసీన వెళ్లింది. వ్యాన్ వద్దకు చిన్నారి అరీబా రావడాన్ని తల్లి గమనించలేదు. సాజిత్ ఎక్కగానే వ్యాన్ ముందుకు కదలడంతో ముందు చక్రాల కింద అరీబా పడి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందింది. ఈ మేరకు డ్రైవర్ ఎనగందుల రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. వ్యాన్‌లో విద్యార్థులను ఎక్కించడానికి పాఠశాల సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కార్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16: భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కార్ ఖూనీ చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. చంద్ర రాజేశ్వరావు చిత్రపటానికి చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా నాయకులు నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. చంద్ర రాజేశ్వరరావు తన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేశారని అన్నారు. దోపిడీ రహిత, వర్గరహిత సమాజం కోసం జీవితకాలం పనిచేశారన్నారు.


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన ఎంఐఎం మాజీ చీఫ్ వాజుద్దీన్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15: కరీంనగర్‌కు చెందిన ఎంఐఎం మాజీ చీఫ్, వాజుద్దీన్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి వాజుద్దీన్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే, కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్‌రావు పాల్గొన్నారు.

'వింధ్యావాలి'లో శ్రీరామ నవమి ఉత్సవాలు



నాటకాన్ని ప్రదర్శిస్తున్న వింధ్యావాలి విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో మంగళవారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశరావు జ్యోతిప్రకాశనం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరాముడు లోకానికి ఆదర్శప్రాయుడని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన శ్రీరామ కల్యాణం నాటకం, వేషధారణలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వింధ్యావ్యాలీ పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్ పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిన్న జీయరుస్వామి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: ఆగమ శాస్త్ర పండితుడు కాందూరి యామునాచార్య స్వామి కుమారుడు కాందూరి వేంకటేశ్వర్లు సేకరించి, కూర్చిన కల్యాణం కమనీయం పుస్తకాన్ని సోమవారం రాత్రి పద్మనాయక కల్యాణమండపంలో చిన్న జీయరుస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంబి వేణుగోపాలాచార్యులు, వరప్రసాదాచార్యులు, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, పీచర కృష్ణమాచార్యులుతో పాటు శేషం వేంకట రమణాచార్యులు, కెఎస్ అనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రక్కన గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో, యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. సీతారాముల ఉత్సవ మూర్తులను ఊయలలో ఉంచి అలంకరించగా మేయర్ యాదగిరి సునీల్‌రావు నామకరణం చేశారు. పసుపు దంచి, తలంబ్రాలు కలిపి సుగంధ, పూజా ద్రవ్యాలను సిద్ధం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

ఊటూర్ సొసైటీలో అవినీతి అక్రమాలపై విచారణ

మానకొండూర్, ఏప్రిల్ 16 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఉన్న ఊటూర్ సహకార సంఘంలో అవినీతి అక్రమాలపై మంగళవారం సహకార సంఘం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. రాజు ఆధ్వర్యంలో విచారణ జరిగింది. సహకార సంఘంలో అవినీతిఅ అక్రమాలు జరుగుతున్నాయని పలువురు సభ్యులు గత ఫిబ్రవరిలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులకు పిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు సహకార సంఘంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. రాజు చేపట్టిన విచారణలో పలువురి సభ్యుల వాంగ్మూలాన్ని తీసుకున్నారు. సభ్యులు ఇచ్చిన వాంగ్మూలాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన తెలిపారు. ఈ విచారణలో సహకార సంఘం అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, సభ్యులు, సంఘం కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది.మంగళవారం మార్కెట్ యార్డుకు 39మంది రైతులు 651క్వింటాళ్ల విడి పత్తిని వివిధ వాహనాల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. తిరిగి గురువారం మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

20న హుజూరాబాద్‌కు మందకృష్ణ మాదిగ రాక

హుజూరాబాద్, ఏప్రిల్ 16: ఈ నెల 20న హుజూరాబాద్‌కు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ ఇంజం వెంకటస్వామి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటరీ పరిధి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సంయుక్త సమావేశం ఈ నెల 20న హుజూరాబాద్‌లోని సాయిరూప గార్డెన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, యువసేన మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో రామచంద్రం, శ్రీనివాస్, రవీందర్, రాజ్‌కుమార్, ప్రభాకర్, మల్లయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల ధర్నా

శంకరపట్నం, ఏప్రిల్ 16: శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని కావేరి సీడ్స్ ప్లాంట్ ఎదుట ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో బీహార్ హమాలీ కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీ రేట్లు గిట్టుబాటు కావడం లేదన్నారు. వెంటనే హమాలీ కార్మికుల కూలీరేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సీడ్ ప్లాంట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

హుజూరాబాద్‌రూరల్,ఏప్రిల్16: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ కె.శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సైబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రెయిన్ ఓ విజన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మొబైల్ ఇంటర్‌ఫేస్ టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సాంకేతిక రంగంలో రోజురోజుకు వస్తున్న మార్పులను విద్యార్థులు గమనించాలన్నారు. మొబైల్ అప్లికేషన్ రంగంలో చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ కె. రవీంద్రబాబు, సమన్వయకర్తలు పవన్, రఘు, భాస్కర్, ప్రకాష్ ఉన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

-టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 16: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం టీఎస్ఎన్‌పీడీసీఎల్ సమావేశ మందిరంలో విద్యుత్ శాఖ అధికారులకు సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులను చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సిబ్బంది చేత భద్రత నిబంధనల ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ కార్యక్రమంలో బిల్లింగ్, రెవెన్యూ సేకరణ, బకాయిల జాబితా ఆపరేషన్, లైన్స్ మెయింటెనెన్స్, పెట్రోలింగ్, డిఫెక్ట్ ఐడెంటిఫికేషన్, అటెండింగ్ బ్రేక్‌డౌన్‌లు, ఎర్తింగ్, ఎల్‌సీ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్‌రెడ్డి, రాజం, ఎం.తిరుపతి, చంద్రమౌళి, లక్ష్మారెడ్డి, కాళిదాసు, ఏడీలు, మాస్టర్ ట్రైనర్ మల్లేశం, పురుషోత్తం, సత్యనారాయణ, సంపత్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తే వేటు తప్పదు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15: యువజన కాంగ్రెస్ శ్రేణులు కాంగ్రెస్‌పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే చర్యలకు పాల్పడినా, అవాస్తవాలను ప్రచారం చేసినా వేటు తప్పదని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వాన్ని, పార్టీ అంతర్గత విషయాల పట్లగాని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా అనుచితంగా పార్టీపై అవాస్తవాలు ప్రచారం చేసిన వారు పార్టీ క్రమశిక్షణ చర్యలకు అర్హులుగా పరిగణింపబడతారని పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా, ఐకమత్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో స్థానిక కాంగ్రెస్‌పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ, స్వాతంత్ర సంగ్రామంలో కాంగ్రెస్‌పార్టీ పాత్ర, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్‌పార్టీ చూపిన చిత్తశుద్ధిని, ఈ దేశ అభివృద్ధి కోసం, దేశ ప్రజల సమైక్యత కోసం కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రణాళికలను రూపొందించి ప్రచారం నిర్వహించాలని జిల్లా యువజన కాంగ్రెస్ పక్షాన కార్యవర్గ సభ్యులకు, నాయకులకు, బూత్ స్థాయి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు



ముస్తాబైన కోదండరామాలయం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా సీతారామకల్యాణానికి తీగలగుట్టపల్లి కోదండరామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో షామియానాలు, టెంట్లు, పెండాల్స్ వేశారు. తాగునీరు, ప్రసాద వితరణ కోసం తగు ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఉదయం 11.55 నిమిషాలకు కోదండరామస్వామి కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి పూర్ణాహుతి, సహస్రదీపాలంకరణ, పుష్పయాగం, నాగవెల్లి, ఏకాంత సేవ, ధ్వజావరోహణం జరుగును న్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

●హుజూరాబాద్: పట్టణంలోని రామాలయంలో శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ క్యాస చక్రధర్ మంగళవారం తెలిపారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌కు 'ట్రినిటి' అభినందనలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 16: యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థి, రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించడం గర్వ కారణమని ట్రినిటి కళాశాల యాజమాన్యం అభినందించింది. ట్రినిటిలో ఇంటర్మీడియట్ చదివిన సాయికిరణ్ ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించడమే కాకుండా ఎన్ఐటీ వరంగల్‌లో చేరి బీటెక్‌లో కూడా అద్భుత ప్రతిభ చూపాడని కళాశాల ఫౌండర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ట్రినిటి కళాశాలలో చదివిన సాయికిరణ్ సివిల్స్‌లో 27వ ర్యాంకు సాధించడం కళాశాలకు, జిల్లాకు ఎంతో గర్వకారణమని మనోహర్‌రెడ్డి కొనియాడారు. తమ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులుగా ఎంపికయ్యారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యనందించి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషిచేస్తామని చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కళాశాలలో స్వీట్లు పంపిణీ చేశారు.

సీతారాములకు ఎదుర్కోలు వేడుక



ఉత్సవమూర్తులకు స్వాగతం పలుకుతున్న మంత్రి పొన్నం దంపతులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా కరీంనగర్‌లోని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో మంగళవారం సప్తగిరి కాలని కోదండ రామాలయంలోని సీతారాముల ఉత్సవ మూర్తు లకు ఎదుర్కోలు వేడుక నిర్వహించారు. మంత్రితో పాటు కుటుంబసభ్యులు వేద మంత్రాల మధ్య స్వామివారికి అమ్మవారికి ఎదుర్కోలు శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కటకం వేంకటరమణ, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

పద్మనాయక ఏసీ ఫంక్షన్‌హాల్‌కు భూమి పూజ



ఫంక్షన్‌హాల్‌కు భూమి పూజ చేస్తున్న చిన్న జీయరుస్వామి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: నగరంలోని ముఖరంపురలో గల పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం ఏసి ఫంక్షన్‌హాల్ నిర్మాణం కోసం చిన్న జీయరుస్వామి భూమి పూజ చేశారు. గత నెల 10వ తేదీన సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు భూమి పూజ చేశారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు సూచన లతో దాతల సహకారంతో నిర్మాణం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పద్మ నాయక వెలమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జువ్వాడి వేణుగోపాల్ రావు, చీటి ప్రకాశరావు, ఉపాధ్య క్షుడు గండ్ర సంపత్‌రావు, సంయుక్త కార్యదర్శి భూపతిరావు, కోశాధికారి నిమ్మనేని భీంరావు, సభ్యులు జువ్వాడి అనిల్ కుమార్, వాల శంకర్‌రావు, సుంకిశాల సంపత్‌రావు, జూపెల్లి మాదవరావు, చిట్నేని రఘు రాంరావు, జోగినపల్లి రాజగోపాలరావు, పల్లెపాటి వేణుగోపాలరావు, అయిల్నేని సుధాకరరావు, అశోక్‌రావు, బోయినపల్లి గీత, మంజుల పాల్గొన్నారు.

గంగోనికుంట కబ్జాపై రెవెన్యూ అధికారుల విచారణ



హుజూరాబాద్‌లో ఆక్రమణకు గురవుతున్న గంగోనికుంట

హుజూరాబాద్, ఏప్రిల్ 16: హుజూరాబాద్ పట్టణంలోని గంగోనికుంట స్థలం కబ్జాకు గురైందని, కొంత మంది ఫిర్యాదు చేయడంతో మంగళవారం హుజూరాబాద్ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది విచారణ జరిపారు. గంగోనికుంటలో గుర్తు తెలియని వ్యక్తులు మొరం పోయడంపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హుజూరాబాద్ పట్టణంలోని బండ అంకూస్‌వాడలోని సర్వే నంబర్ 2477లో 12ఎకరాల 16గుంటల విస్తీర్ణంలో గంగోనికుంట ఉంది. ఇటీవల పట్టణంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో కొంత మంది అక్రమార్కులు పట్టణ ప్రజాప్రతినిధుల సహకారంతో అక్రమించుకునేందుకు మట్టిని నింపుతున్నారు. ఇదంతా జరుగుతున్నా ఐబీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సమ్మయ్య అనే స్థానికుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శేఖర్, రంజిత్ గంగోనికుంట వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ నెల 18న గంగోనికుంటను సర్వేయర్‌తో సర్వే చేసి హద్దులు నిర్ణయించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెరువు కట్టకు మరమ్మతు చేపట్టాలి

మానకొండూర్, ఏప్రిల్ 16: బుంగపడ్డ మానకొండూర్ పెద్ద చెరువు కట్టకు వెంటనే మరమ్మతు చేపట్టాలని సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానకొండూర్‌లోని చెరువుకట్టకు బుంగపడ్డ ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుకట్టకు బుంగపడడమే కాకుండా మత్తడిగుండా వెళ్లాల్సిన నీరు కాంక్రీట్ బెడ్ కింద నుంచి ఏడాదిగా నీరు వృధాగా పోతుందని అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో నీరంతా వృధాగా పోయి పంటపొలాలు ఎండిపోయే దుస్థితి నెలకొందన్నారు. కలెక్టర్ చొరువ తీసుకొని ఇరిగేషన్ అధికారులతో మరమ్మతు పనులు చేపట్టాలని లేని యెడల సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గట్టు సతీష్, గట్టు తిరుపతి, ఆయకట్టు రైతు పిట్టల శ్రీనివాస్, నెల్లి రాకేశ్, గట్టు రాజు, అడుప వీరయ్య, తోట శ్రీనివాస్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వీణవంక,ఏప్రిల్16:మండలంలోని పోతిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన పంజాల సునీత రాజులు 1,51,116 రూపాయల విరాళం అందించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమములో పంజాల సతీష్,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిరుతల రామాయణం



ఎక్లాస్‌పూర్‌లో చిరుతల రామాయణం కళాకారుల ప్రదర్శన

సైదాపూర్, ఏప్రిల్ 16: శ్రీరామనవమిని పురస్కరించుకొని సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు నిర్వహించిన చిరుతల రామాయణం గ్రామ ప్రజలను ఆకట్టుకుంది. ప్రతి శ్రీరామనవమికి చిరుతల రామాయణం వేయడం ఆనవాయితీగా వస్తుందని కళాకారులు తెలిపారు. కళలను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో రామాయణం వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు చక్రపాణి లక్ష్మీనరహరిచారి, సంతపురి మల్లారెడ్డి, రాధారపు కనకయ్య, గుండేటి శ్రీనివాస్, చిక్కుల కొంరయ్య, కారంకంటి కనకయ్య, కుమారస్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దు : ఏసీపీ



యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, ఏప్రిల్ 16: యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో గంజాయికి అలవాటు పడిన 24మందికి ఏసీపీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. గంజాయి విక్రయించి, సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే గంజాయికి అలవాటు పడ్డ వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ బొల్లం రమేష్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను మంగళవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ముగ్గురు వాహనదారులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 5,500 రూపాయలు జరిమానా విధించారని తెలిపారు. మిగతా 13 మంది వాహనదారులకు 23 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16: అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. రాజీవ్‌చౌక్ సమీపంలో రోడ్‌పై స్పృహకోల్పోయి పడిఉన్న గుర్తుతెలియని వ్యక్తి(55)ని సోమవారం 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. అనారోగ్యం లేదా ఎండదెబ్బకు గురై మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మార్చూరీ గదిలో బద్రపరిచామని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించినవారు వెంటనే ఫోన్ నెంబరు 8712670761, 9908440822కు సమాచారం అందించాలని కోరారు.

నాటుసారా తయారీ కేసులో వ్యక్తికి జరిమానా

హుజూరాబాద్, ఏప్రిల్ 16: శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన అంగిడి సుధాకర్ అనే వ్యక్తి నాటుసారా తయారీ కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా విధించినట్లు హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ టి శ్రీనివాస్‌లు మంగళవారం తెలిపారు. సుధాకర్ అనే వ్యక్తి నిబంధనలు ఉల్లంఘించి నాటుసార తయారు చేస్తున్నారన్నారు. ఈ మేరకు సుధాకర్‌ను శంకరపట్నం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా రూ.25వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఎవరైనా నాటు సారాయి తయారు చేయడం, అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రిని కలిసిన చేనేత కార్మికులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 16: రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉమ్మడి జిల్లా చేనేత కార్మికుల సహకార సంఘం ప్రతినిధులు మంగళవారం కరీంనగర్‌లోని మంత్రి నివాసంలో కలిసి వారి సమస్యలను విన్నవించుకున్నారు. చేనేత కార్మికులను కాపాడండి.. కాటన్ వస్త్రాలను ప్రోత్సహించండి... పెద్దలను మర్యాదచేసేందుకు కాటన్ టవల్స్‌ను ఉపయోగించాలంటూ ఇటీవల మంత్రి చేసిన వ్యాఖ్యలకు చేనేత కార్మికులు కరీంనగర్‌కు వచ్చి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో మంత్రి మాట్లాడారు. చేనేత కార్మికులకు అండగా ఉంటానని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నివాసంలో ఎదుర్కోలు వేడుక

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా మంగళవారం క్రిస్టియన్ కాలనీలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి నివాసంలో సీతారాములకు ఎదుర్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. వైదికుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, సందర్భోచిత కల్యాణ ఘట్టాల పాటలు, భక్తి పారవశ్యం నడుమ నరేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిర నిర్మాణం కావడంతో ఈ సారి వేడుకలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. ఆదర్శప్రాయుడైన రాముడు చూపిన బాటలో అందరూ నడవాలని అన్నారు. రామయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యకమంలో సప్తగిరికాలని కోదండరామాలయం కమిటీ బాధ్యులు, ఋత్వికులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

చిగురుమామిడి,ఏప్రిల్ 16: మండలంలోని సుందరగిరి నుంచి గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి గ్రామం వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభించక పోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని గాగిరెడ్డిపల్లి గ్రామ సొసైటీ చైర్మన్ మంద శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ. 19 కోట్ల నిధులతో మంజూరైన డబుల్ బీటీ రోడ్డు పనులను కాంట్రాక్టర్లు నామమాత్రంగా పనులు చేసి వదిలి పెట్టారని అన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

గన్నేరువరం, ఏప్రిల్ 16, మండలంలోని మాదాపూర్, గునుకుల కొండాపూర్, పారువెల్ల గ్రామాలలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 11 మందిని మంగళవారం తహశీల్దారు భిక్షపతి ముందు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. గ్రామాలలో బెల్ట్‌షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'దేశాన్ని రక్షించే ఏకైక పార్టీ బీజేపీ'

చిగురుమామిడి,ఏప్రిల్ 16: దేశాన్ని రక్షించే ఏకైక పార్టీ బీజేపీ అని పార్టీ అసెంబ్లీ కోఆర్డినేటర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గాగిరెడ్డిపల్లి, చిగురుమామిడి గ్రామంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మోదీని మళ్లీ ప్రధాని చేయాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్, అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్‌కు అధికారం

● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, ఏప్రిల్ 16: అరవై ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం చొప్పదండిలో బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, నాయకులు చీకట్ల రాజశేఖర్, కొత్తూరు మహేష్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, లోక రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హోమం నిర్వహించిన గ్రామస్థులు

వీణవంక,ఏప్రిల్16:మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం హోమం నిర్వహించారు. బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు.